telugurekhamedia.com
TELUGU REKHA TELUGU DAILY

# తెలుగు రేఖ


సంపుటి : 01 సంచిక : 308 పేజీలు : 4 వెల : రూ. 2.00
తెలుగు దినపత్రిక

గురువారం 5 ఫిబ్రవరి 2026 తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ RNI No.TELTEL/2010/31853




# రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణ మిర్యాలగూడ

- మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుకు విజయ సూచిక
- మా ప్రభుత్వ కార్యక్రమాలను చూసి ఈ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలి
- 3 కోట్ల10 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం.
- సన్న బియ్యం తింటున్న వారంతా కాంగ్రెస్ కు ఓటెయ్యాలి
- బిఆర్ఎస్ ఇచ్చిన దొడ్డు బియ్యం బర్రెలకు దానగా పెట్టారు
- సీఎం రేవంత్ రెడ్డి






నల్లగొండ, ఫిబ్రవరి 04,( తెలుగురేఖ) రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణ మిర్యాలగూడ అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.బుధవారం మిర్యాలగూడ లోని గూడూరులో ఏర్పాటుచేసిన మున్సిపల్ ఎన్నికల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుకు విజయసూచిక గా వేలాది మంది తరలివచ్చారన్నారు.సభలో ఆడబిడ్డలు ఉత్సాహంగా చూస్తే చూస్తే మున్సిపల్ ఎన్నికల్లో ఎదురులేదని విశ్వాసం వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం గిరిజనులు,పేదలు, ఆదివాసీలు,నిరుద్యోగులు, మహిళలు,మైనార్టీల కోసం అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. మా ప్రభుత్వం చేపడుతున్న పథకాలను చూసి మున్సిపల్ ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని కోరారు.తెలంగాణ వచ్చిన తర్వాత గత ప్రభుత్వం కనీసం రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మందికి రేషన్ కార్డులు ఇచ్చాం.3 కోట్ల10 లక్షల మందికి సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు.గత ప్రభుత్వం ఇచ్చిన దొడ్డు బియ్యం బర్రెలకు ధానాగా వేశారని పేర్కొన్నారు.పేదవారు కడుపునిండా బుక్కెడు బువ్వ తినలేదని ఆవేదన చెందారు. మా ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం పేదలకు అందుతున్నాయన్నారు. సన్న బియ్యం వండుకుని తింటున్న వారందరు కాంగ్రెస్ కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటికి 2 వందల యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, ఇళ్లలో విద్యుత్ వెలుగులతో మీ కళ్లలో సంతోషం చూస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో ఆ నాటి సీఎం వరి వేసుకుంటే ఉరే అన్నాడు, మా ప్రభుత్వం వచ్చాక సన్న వడ్లు పండిస్తే రూ. 5 వందలు బోనస్ ఇస్తున్నాం.బోనస్ తీసుకుంటున్నది అత్యధిక లబ్దిదారులు మిర్యాలగూడాలోనే ఉన్నారని తెలిపారు.రైతు భరోసా కింద ప్రతి ఎకరాకు రూ.6 వేల ఇస్తున్నాం,9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు రైతులకు ఇచ్చామన్నారు.మున్సిపల ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా



అందజేస్తాం అన్నారు. రైతు భరోసా రూ.9 వేల కోట్ల విడుదల చేస్తామన్నారు.రైతుల కొరకు ఇప్పటి వరకు మా ప్రభుత్వం లక్షా10 వేల కోట్లు ఖర్చు చేసిందని 2 లో..

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ

ఖమ్మం,ఫిబ్రవరి 4 తెలుగురేఖ: తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ూజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం 2 లో..



# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

- ఎస్సీఎస్టీ నిధులు మైనార్టీలకు బదలాయింపు
- నిజాం నిరంకుశంపై అంకుశం దింపిన గడ్డ
- ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన సిఎం రేవంత్
- మహబూబ్‌నగర్ ప్రచారంలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్




మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 4 తెలుగురేఖ: తెలంగాణలో రాజకీయాలు చాలా దయనీయంగా ఉన్నాయని.. మనదేశ సంస్కృతి సంప్రదాయాలపై సీఎం రేవంత్ రెడ్డి దాడి చేస్తున్నారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సిన్హా విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ పార్టీ అంటే ముస్లింల పార్టీ అని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించారని గుర్తు చేశారు. బుధవారం నాడు మహబూబ్ నగర్‌లోని ఎంవిఎస్ కాలేజీ గ్రౌండ్‌లో బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన నితిన్ నబీన్.. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన బడ్జెట్ నిధులను మైనార్టీలకు బదలాయించారని ఆరోపించారు. రాష్ట్రంలో 77 వేల ఎకరాల భూమి వక్ఫ్ బోర్డుకు ఉందని గుర్తు చేశారు. ముస్లింల ఓట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు 2 లో..

# తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

- సినీ పరిశ్రమ కేంద్రంగా హైదరాబాద్
- అన్ని భాషల వారు తరలివచ్చినా ప్రోత్సాహం
- ఉగాది రోజు గద్దర్ అవార్డుల ప్రదానం
- మీడియాతో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,ఫిబ్రవరి 4 తెలుగురేఖ: తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని 2 లో..



# స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

- కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్ ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి 4 తెలుగురేఖ : ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి




2 లో..

# పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

- తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని
- టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు



హైదరాబాద్,ఫిబ్రవరి 4 తెలుగురేఖ: పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానించారు.ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలంగాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ 2 లో..

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

- పార్టీ మారిన దాఖలాలు లేవన్న స్పీకర్
- స్పీకర్ తీర్పును స్వాగతించిన సంజయ్
- తాను బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నాని వెల్లడి



హైదరాబాద్,ఫిబ్రవరి 4 తెలుగురేఖ: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ 2 లో..

# ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

- నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 తెలుగురేఖ: పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు రాష్ట్రపతి 2 లో..

# వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

- ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్
- పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు



వేములవాడ,ఫిబ్రవరి 4 తెలుగురేఖ: వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. 2 లో..

# రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

- అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులే నిదర్శనం
- ఏడాదిన్నర కాలంగా ప్రజలను మభ్యపెడుతున్న బాబు
- తిరుమల నెయ్యిలో జంతువు కొవ్వు అంటూ దుష్ప్రచారం
- దేవుడంటే భయం, భక్తి లేకుండా రాజకీయాలు
- కులమతాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీల ఏర్పాటు అభ్యంతరకరం
- అంబటి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సిఎం జగన్



గుంటూరు,ఫిబ్రవరి 4 తెలుగురేఖ: సీఎం చంద్రబాబు ఏడాదిన్నరగా కావాలనే ప్రజలను మభ్య పెట్టే కార్యక్రమం చేపట్టారని సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మండిపడ్డారు. తిరుమల లడ్డు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందని రకరకాలుగా ప్రచారం చేశారని, చివరికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా అసత్య ప్రచారం చేశారని అసహనం వ్యక్తం చేశారు. దేవుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా రాజకీయాలు చేశారని ఫైర్ అయ్యారు. అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజని మీద దాడులు చేశారని.. వారు చేసిన తప్పేంటి? అని ప్రశ్నించారు. 2 లో..

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు‘ అని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో పవన్ తెలంగాణ గురించి చాలా నీచంగా మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన మాటలను ఎవరూ విశ్వసించరని, ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కోరుకుంటున్నారుని.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి సంక్షేమం, అభివృద్ధి ఇస్తుందని అన్నారు. అందుకే రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతానికిపైగా మున్సిపాలిటీలు కాంగ్రెస్ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఆ భయంతో పవన్ కల్యాణ్ లాంటి సినీ తారలను బీజేపీ నాయకులు అడుక్కునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలో పవన్ కల్యాణ్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. ఆంధ్రాలో రాజకీయాలు చేసుకుంటే మంచిదని పీసీసీ చీఫ్ సూచించారు.

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఓవైపు జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికల వేళ అసలు కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి దుమ్మెత్తిపోస్తున్న తరుణంలోనే ఫిరాయింపు ఎమ్మెల్యేకు క్లీన్ చిట్ ఇవ్వడం స్పీకర్ పదవికున్న గౌరవాన్ని దెబ్బతీయడమే. పంచాయతీ ఎన్నికల్లో తగిలిన ఘోరమైన ఎదురుదెబ్బతో కోలుకోని కాంగ్రెస్ పార్టీ బైఎలక్షన్స్ అంటే భయపడుతోందని అర్థమైపోయింది. మున్సిపల్ ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రి వైఫల్యాలు, మోసాలపై పట్టణ ప్రజల్లో పెద్దఎత్తున వెల్లువెత్తుతున్న ఆగ్రహాన్ని చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని తేలిపోయింది. పార్టీ ఫిరాయింపుల సూత్రధారి ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి మౌనం వహిస్తున్న రాహుల్ గాంధీకి ఇకనుంచి రాజ్యాంగాన్ని పట్టుకుని తిరిగే నైతిక హక్కు లేదు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించినా ఒక్కరిపై కూడా చర్య తీసుకోకుండా సీఎం నడిపిస్తున్న ఈ వికృత రాజకీయ క్రీడకు ప్రజాక్షేత్రంలోనే గుణపాఠం తప్పదని పేర్కొన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఆయన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నామని స్పీకర్ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. సంజయ్‌పై అనర్హత కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీ ఫిరాయిపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యేకు కూడా క్లిన్ చిట్ ఇచ్చేశారు స్పీకర్. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే స్పందిస్తూ... ’ నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చా. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్ పార్టీని, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది ఎలక్షన్ కోసం కాదు.. అభివృద్ధి కోసం ఆరాటం. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా’ అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి. నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చానని సంజయ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ బీఆర్ఎస్‌లోనే ఉన్నానని కడియం శ్రీహరి చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యానించారు. కడియం నీతులు చెప్పడం ఆపు. నువ్వు కాంగ్రెస్‌లో చేరావని స్పీకర్ ముందు అంగీకరించు. దిల్లీ వెళ్లి రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొని ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. కాలయాపన చేసి అనర్హత నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఆధారాలు లేవని ఎనిమిది మందికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారు‘ అని వివేకానంద తెలిపారు.

## వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమిషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పేదలు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

## ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోడీ మాట్లాడనున్నారు. ఇకపోతే భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిపోతుందని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయ కుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తార న్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు. ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు.

## సంజయ్ ఇకనైనా బుద్ధిగా ఉండు

### - కాంగ్రెస్ రాజకీయాలను వదులుకో

### - ఎమ్మెల్యేకు జీవన్ రెడ్డి చురకలు

జగిత్యాల,ఫిబ్రవరి 4 **తెలుగురేఖ**:

స్పీకర్ తీర్పుతో అయినా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఇక కాంగ్రెస్ జోలికి రాకుంటే మంచిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. బుధవారం నాడు జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ’ఎమ్మెల్యే సంజయ్ అనర్హత పిటిషన్‌పై శాసనసభ స్పీకర్ ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నా. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నా అని సంజయ్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా. సంజయ్ నీకు దొంగ బుద్ధి ఎందుకు?. స్పీకర్ తీర్పుతో పద్ధతిగా ఉండు. నా కాంగ్రెస్ పార్టీలో చిచ్చుపెట్టకు. నీ బీఆర్ఎస్ పార్టీలో నువ్వు కరెక్ట్‌గా ఉండు. నా పార్టీ అంతర్గత విషయాల్లో ఎందుకు వేలు పెడుతున్నావు?. అభివృద్ధి అంటే పక్కింట్లోకి కన్ను వేయడమా?. గడిచిన రెండు ఏళ్లలో సీఎం రేవంత్‌తో ఉండి నువ్వు చేసిన అభివృద్ధి ఏంటీ చెప్పు.. సంజయ్?’ అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు ఏడాదిన్నర కాలంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన సంజయ్‌కు పార్టీలో ప్రాధాన్యం ఇవ్వడంపై జీవన్ రెడ్డి గతంలోనూ ఘాటుగా విమర్శించారు. తాజాగా మున్సిపల్ ఎన్నికల వేళ టికెట్ల అంశంతో ఆ విభేదాలు మరింత ముదిరినట్లు తెలుస్తోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా.. 29 టికెట్లు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి, 21 టికెట్లు జీవన్ రెడ్డి వర్గానికి పార్టీ అధిష్ఠానం కేటాయించినట్లు సమాచారం. ఈ అంశం జీవన్ రెడ్డి వర్గంలో మరింత అసంతృప్తిని పెంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రైస్ బౌల్ ఆఫ్ తెలంగాణ మిర్యాలగూడ

పేర్కొన్నారు. తెలంగాణలో ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచితప్రయాణం కల్పించాం.కోట్లాది మంది ఆడ బిడ్డలు అమ్మగారి ఇంటికైనా, అమ్మవారి గుడి కైనా ఉచితంగా వెళ్లున్నారన్నారు.ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసిన మహిళలు కాంగ్రెస్ కు ఓటేస్తే బీజేపీ,బీఆర్ఎస్ కు వాళ్లకు డిపాజిట్లు రావని చెప్పారు. బీఆర్ఎస్,బీజేపీ తరుపున పోటీ చేస్తున్న మహిళా అభ్యర్థులకు కూడా ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం.బీఆర్ఎస్ నాయకులకు కూడా సంక్షేమ కార్యక్రమాలు ఇస్తున్నాం.ఎక్కడా వివక్ష చూపలేదని చెప్పారు. బీఆర్ఎస్ నాయకుల పిల్లలు కూడా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్లో చదువు కోవచ్చున్నారు.రాష్ట్రంలో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, వైఎస్ఆర్ హయాంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించామని గుర్తు చేశారు.డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టిస్తామని కేసీఆర్ ఆనాడు ఊరించాడు తప్ప, కట్టించలేదని ఎద్దేవా చేశారు. పదేళ్లు సీఎంగా ఉండి ఫామ్ హౌస్,ప్రగతి భవన్ కట్టుకున్నాడనీ స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. దళారులు,దగా లేకుండా నేరు గా లబ్దిదారుల ఎకౌంట్ లోనే డబ్బులు వేస్తున్నామని వెలిబుచ్చారు.ప్రతి ఎమ్మెల్యే,మాకు మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నారని తెలియజేశారు.వచ్చే బడ్జెట్ లో కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబోతున్నామని స్పష్టం చేశారు.నల్గొండ జిల్లా ఫ్లోరైడ్ ప్రాంతం,ఈ సమస్యకు పరిష్కారం గతంలో దొరకలేదని, నల్గొండ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ పార్టీ కట్టినవేనని గుర్తు చేశారు.ఎస్ ఎల్ బీసీ 30 కిలో మీటర్ల టన్నెల్ ను గత కాంగ్రెస్ ప్రభుత్వం తొవ్విందన్నారు. నల్గొండ జిల్లాపై కోపం,విషంతో ఎస్ ఎల్ బీసీ ని పూర్తి చేయలేదని విమర్శించారు.ఎస్ ఎల్ బీసీ ని రెండేళ్లలో పూర్తి చేసి నల్లగొండ జిల్లాను సత్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు.ఎస్ ఎల్ బీసీలో 8 మంది చనిపోతే మామ, అల్లుడు,బామ్మర్ధి సంతోష పడ్డారు.కడుపులో విషం పెట్టుకున్నవాళ్లు మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడగడం సిగ్గుచేటు అన్నారు.గంగిరెద్దుల్లా గా ఇంటి ముందుకు పోతారని కర్రు కాల్చి వాత పెట్టాలని ప్రజలను కోరారు.గంజికి గతి లేని వాళ్లు బెంజ్ కార్లు కొన్నారని,అదంతా మందిని ముంచినదేని చెప్పారు.నల్గొండ జిల్లా ప్రజలు కాంగ్రెస్ కు అండగా నిలబడాలని,రెండేళ్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం.రైతు రుణమాఫీ చేశాం.రైతు భరోసా ఇచ్చాం..నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం.1000 బస్సులకు మహిళలను యజమానులను చేసిన ఘనత మా ప్రభుత్వానిదేనని చెప్పారు. మహిళా సంఘాలతో పెట్రోల్ బంకులు పెట్టించాం.రూ.25 వేల కోట్లను సున్నా వడ్డీకి మహిళా సంఘాలకు అందజేసినట్లు పేర్కొన్నారు.ప్రజా ప్రభుత్వం తోనే సాధ్యం అయిందన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణను దోచుకున్నారు. పెళ్లం మొగుడు మాట్లాడుకుంటే ఫోన్లు విన్నరు.జర్నలిస్టులను, సినిమా తారలను,జడ్జీలను, ఎవరిని వదలకుండా ఫోన్లు విని రాక్షసానందం పొందారని తెలియజేశారు.అన్నం తినే వాళ్లు ఎవరరైనా పెళ్లాం మొగుడు మాట్లాడుకుంటే వింటారా.. అని ప్రశ్నించారు. కొంత మంది జాతిపితను విచారిస్తారా అని అడుగుతున్నారు,ఎవరికి రా నువ్వు జాతి పితవు,నీ జాతికి నువ్వు పిత కావొచ్చు,మాకు కాదన్నారు.పెళ్లాం మొగుడు జోలి విన్న సన్నాసి నువ్వు జాతిపితవా.. అన్నారు.కేసీఆర్, కేటీఆర్,హరీష్ రావును మొఖాలకు ముసుగు తొడిగి విచారణకు పోలీసులు తీసుకొస్తే బాగుండేదని చెప్పారు. జాతిపిత అయితే మీ ఆస్తులను తెలంగాణ ప్రజలకు ఇస్తారా..? కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్ , కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ , హరీష్ రావు మోయినా బాద్ ఫామ్ హౌస్,టీవీలు,ఫేపర్లు,వేల కోట్లు తెలంగాణ ప్రజలకు ఇస్తారాఅని అన్నారు.సీఎం, మంత్రి,ఎమ్మెల్యే అన్ని పదవులు మీరే తీసుకున్నారు.తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు చిన్న పదవి కూడా ఇవ్వలేదనీ పేర్కొన్నారు.తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకరే జాతి పిత అవుతడు చెప్పారు.ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ మొత్తం పోయినా,తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేరవేర్చిన సోనియమ్మ తెలంగాణ తల్లి అవుతుందన్నారు.సన్నాసి,దొంగ నువ్వేలా జాతి పిత అవుతావు,తెలంగాణ ప్రజలకు మీరు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భాస్కర్ రావు మిర్యాలగూడా లో కాంగ్రెస్ కార్యకర్తలు గెలిపిస్తే ఆత్మగౌరవాన్ని ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో కేసీఆర్ పాదాల దగ్గర పెట్టాడు.మా అభ్యర్థులను బెదిరిస్తే భాస్కర్ రావు నీకు చింత పడతదన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ భయపడొద్దని,జానారెడ్డిని ఓడించడానికి భాస్కర్ రావు ఇంటింటికి తిరిగాడు.నల్గొండ జిల్లాలో 18 మున్సిపాలిటీల్లో గెలుస్తామన్నారు.తెలంగాణలో మున్సిపాలిటీల్లో 17,472 కోట్లు ఖర్చు పెట్టాం.

నల్గొండ జిల్లా మున్సిపాలిటీల్లో 2028 కోట్లు ఖర్చు పెట్టాం.మిర్యాలగూడ మున్సిపాలిటీలో 295 కోట్ల ఖర్చు చేశాం.మున్సిపల్ శాఖ నా దగ్గరే ఉందని,మున్సిపాలిటీల అభివృద్ధి నా బాధ్యతన్నారు.వడ్డించే వాడు మనవాడు,అడిగే వాడు మన వాడు ఉండాలి,3 ఏళ్ల తర్వాత, మళ్లీ అధికారంలో మేమే ఉంటాం. మున్సిపాలిటీలను అద్దంలా తీర్చిదిద్దుతామన్నారు. కాంగ్రెస్ గెలిస్తే పేదవాడు గెలిచినట్లే,అభివృద్ధి జరగాలంటే అధికార పార్టీ గెలిపించాలని కోరారు.గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరలు దేనికైనా పనికి వచ్చాయా..? సారె పెట్టినట్లుగా ఆడబిడ్డలు ఇందిరమ్మ చీరలు కట్టుకుని వచ్చారు.జమ్మికి వచ్చిన పాలపిట్టల్లా ఇందిరమ్మ చీరల్లో ఆడబిడ్డలు కనిపిస్తున్నరు.ఓటేసే ముందు సన్నబియ్యం,రేషన్ కార్డు,రైతు భోరోసా,రుణమాఫీ,బస్సు ప్రయాణం,70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు,ఇందిరమ్మ ఇళ్లను గుర్తు ఉంచుకోవాలని కోరారు. 123 మున్సిపాలిటీల పైన కాంగ్రెస్ జెండా ఎగురుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు,ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట

వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు. అందుకే వారి పేరు మీద గత సంవత్సరం నుంచి సినిమా అవార్డులు ఇవ్వడం ప్రారంభించి, సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినీ రంగ ప్రముఖులకు ఉన్న అనుభవాన్ని, నిబద్ధతను, సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు. ప్రతి పని సమాజానికి ఉపయోగపడాలి, ప్రజలకు జవాబు దారిగా ఉండాలన్న లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. గద్దర్ అవార్డుకు ఎంపిక చేసే సినిమాలో కమర్షియల్ అంశంతో పాటు సామాజిక సందేశం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త తీసుకుంటే రాబోయే రోజుల్లో సమాజంలో మంచి సినిమాలను ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఈనెల 6 నుంచి గద్దర్ సినిమా అవార్డుల స్క్రీనింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 19న ఉగాది పండుగ రోజు గద్దర్ అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ ఆరాటం

చేస్తోందని విమర్శించారు ముస్లిం ఓటు బ్యాంకు కోసం కాంగ్రెస్ నేతలు ఆరాటపడుతున్నారని నితిన్ నబీబ్ విమర్శించారు. నిజాం నిరంకుశానికి వ్యతిరేకంగా ఈ గడ్డ నుంచి పోరాడారు. హైదరాబాద్ విముక్తి కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైంది. ఎన్నికల హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. రైతు భరోసా, రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఎస్సీలు, ఆదివాసీలు, బీసీలను ప్రభుత్వం మోసం చేసింది. అభివృద్ధి పనులు, బిల్లుల మంజూరుకు ఆర్ఆర్ ట్యాక్స్ కట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. అవినీతి, కమిషన్ల ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే భాజపాను గెలిపించాలి.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అనేక హిందూ దేవాలయాలను కూల్చారంటూ మండిపడ్డారు నితిన్ నబీన్. ఆలయాలపై రాజకీయం చేస్తే.. బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. అవసరమైతే తాము ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే.. ఎక్కువ రోజులు ఉండబోదంటూ హెచ్చరించారు. ప్రధాని మోదీ.. మహిళలను లక్షాధికారులను చేయాలని చూస్తే.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మహిళలను పూర్తిగా మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు నితిన్ నబీన్ సూచించారు. తెలంగాణకు సముచిత స్థాయిలో కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. రాష్ట్రంలో రైల్వేకు రూ.5,400 కోట్లకుపైగా కేటాయించింది. తెలంగాణకు మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు కేటాయించింది. రాష్ట్రంలో రెండు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం పట్ల ఆదరణ పెరుగుతోంది. ఈయూతో ఒప్పందం చేసుకుని దేశాభివృద్ధికి కృషి చేస్తోంది. కొన్నివర్గాలను సంతృప్తి పరచడానికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఆరాటపడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో బలహీనవర్గాలకు ఎలాంటి న్యాయం జరగలేదు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల నిధుల్లో ప్రభుత్వం కోత పెడుతోంది. వక్ఫ్ బోర్డును బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ సర్కారు యత్నిస్తోంది. హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా నోరు మెదపట్లేదు. హిందువుల మనోభావాలు దెబ్బతీస్తూ ఆలయ భూములు ఆక్రమిస్తున్నారు. రాష్ట్రంలో సనాతన ధర్మం మీద జరుగుతున్న దాడులను సహించం‘ అని నితిన్ నబీబ్ అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని.. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే కాదు.. బీఆర్ఎస్ పాలనలో సైతం పాలమూరుకు అన్యాయం జరిగిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతాయని.. చేతలు మాత్రం గడప కూడా దాటవని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో అవినీతి జరిగిందని చెప్పిన రేవంత్ రెడ్డి ఏ ఒక్కరి మీద చర్య తీసుకున్నారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

కేసీఆర్, రాహుల్ గాంధీ మధ్య ఒప్పందం కుదిరిందని కేంద్రమంత్రి ఆరోపించారు. అందుకే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అందరి ఫోన్లు ట్యాపింగ్ చేసి పౌరహక్కులు కాలరాసిందంటూ బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. బీజేపీ కార్యాలయంలో క్లర్క్ ఫోన్ సైతం ట్యాపింగ్ చేశారంటూ విమర్శించారు. సిట్ నోటీసులు టీవీ సీరియల్‌ను తలపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తద్వారా అభివృద్ధి చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీకి రాజకీయ దురహంకారం పెరిగిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు గెలిస్తే మాత్రం ట్యాక్స్‌లు పెరుగుతాయని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలంటే మాత్రం.. ఈ మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి తీరాలని కేడర్‌కు ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి.. బీజేపీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు టీబీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తోంది

ఇదే ప్రభుత్వం ఎప్పుడూ ఉండదని, వచ్చే మూడేళ్లలో తమ ప్రభుత్వం వస్తుందని వైఎస్ జగన్ అన్నారు. టీడీపీ నేతల దాడిలో ధ్వంసమైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి వెళ్లి.. ఆయన కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించారు.వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ? ’రాష్ట్రంలో జంగిల్ రాజ్యం నడుస్తుంది. భయానక వాతావరణంలో పాలన జరుగుతుంది. అంబటి, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చూస్తే జంజిల్ రాజ్యం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుంది. అంబటి, జోగి, కాకాణిలు చేసిన తప్పేంటి?. ప్రశ్నిస్తున్నారని మా వాళ్ళపై దాడులు చేస్తున్నారు. సీఎం చంద్రబాబు కుట్ర పూరితంగా జంతువుల కొవ్వు అని తప్పుడు ప్రచారం చేసాడు. ఆవు, పంది, చేప కొవ్వు అంటూ ఉద్దేశ్య పూర్వకాలంగా దేవుడి ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం చేసారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గారికి దేవుడంటే భయం భక్తి లేవు. దుర్మార్గంగా తప్పుడు ప్రచారం చేశారు. కేంద్ర ల్యాబ్లు ఎలాంటి జంతువుల కొవ్వు లేదని రిపోర్ట్ ఇచ్చాయి. సీబీఐ అదే విషయాన్ని సుప్రీం కోర్టుకి రిపోర్ట్ ఇచ్చింది. తప్పు చేసి ఉంటే వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి పేర్లు సీబీఐ ఎందుకు చేర్చలేదు. సీబీఐ వాళ్లకు క్లీన్ చిట్ ఇచ్చింది. అసలు సీబీఐ విచారణ కావాలని సుప్రీమ్ కోర్టును కోరిందే వైవీ సుబ్బారెడ్డి. చంద్రబాబు, లోకేష్, పవన్లు చెంపలేసుకుని క్షమాపణ కోరాలి. క్షమాపణ చెప్పకుండా మళ్లీ అదే దుర్మార్గపు అపార్థాలను ప్రచారం చేస్తున్నారు’ అన్ని ÷ర్ అయ్యారు.’సిగ్గు లేకుండా ఫ్లెక్సీలు వేయిస్తున్నారు. కుల మతాలను రెచ్చగొట్టే ఫ్లెక్సీలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం కాదా. ఇలానే మేము సూపర్ సిక్స్ అమలు చెయ్యలేదని ఫ్లెక్సీలు వేస్తే ఒప్పుకుంటారా. ఫ్లెక్సీలు పెట్టి ప్రజల్లో బావోగ్వేదాలు రెచ్చగొట్టేలా చెయ్యడం తప్పు కాదా?. ఇలాంటి దుర్మార్గాలను ప్రశ్నిస్తే మా వాళ్ళపై దాడులు చేయిస్తారా?. సీఎం చంద్రబాబుకి మంచి బుద్ధి ప్రసాదించాలని దేవుణ్ణి కోరి గుడి నుండి వస్తుంటే దాడులు చేసారు. అంబటి రాంబాబుని పోలీసుల సమక్షంలో కర్రలు పట్టుకుని కారుపై దాడికి పాల్పడ్డారు. కారులో ఉన్న రాంబాబుని దారుణమైన భూతులు తిడుతూ దాడి చేసారు. ఒక్కడే ఉండటం వల్ల అంబటి ఆగ్రహానికి గురయ్యారు. అలాంటి సమయంలో నోట్లో నుండి రెండు తిట్లు వచ్చాయి. ప్రాణం మీదకి వచ్చినప్పుడు వచ్చిన తిట్లే తప్ప ఉద్దేశ్య పూర్వకంగా తిట్టలేదు. సంస్కారం ఉన్న వ్యక్తి కనుక ఆ మాటలు రావడంపై బాధపడి.. వివరణ ఇచ్చాడు. తిట్లు వచ్చినందుకు చింతిస్తూ వెనక్కి తీసుకున్నాడు. అలాంటి సంస్కారం ఉన్న అంబటిని చేతనైతే పొగడాలి.. కానీ దుర్మార్గంగా హత్య చెయ్యడానికి ప్రయత్నించారు. ఏకంగా 8 గంటల పాటు హత్యకు ప్రయత్నించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో పోలీసుల సమక్షంలో దాడి చేశారు. ఇంట్లో మహిళలను ఇష్టం వచ్చినట్లు తిడుతూ ఫర్నీచర్ పగలగొట్టారు. కార్లు ధ్వంసం చేసి.. ఆఫీస్ కి నిప్పు పెట్టారు. పోలీసులు బాధ్యతగా వ్యవహరించి ఉంటే ఇలాంటి దాడులు జరిగేవా?. డీజీపీ ఆఫీస్ కూతవేటు దూరంలో ఉంది.. పక్కనే బెటాలియన్ ఉంది.. కంట్రోల్ చెయ్యలేరా?. అధికారులకు ఫోన్లు చేసినా ఒక్కరు ఎత్తలేదు.. పక్కా ఎ÷-లాన్ ప్రకారం హత్యాయత్నం చేసారు’ అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం..

## గాడితప్పుతున్న పార్లమెంట్ సమావేశాలు !

పార్లమెంట్ సమావేశాలు గాడి తప్పాయి. సభలో చర్చలకు ఆస్కారం లేదు. రూల్స్ పాటించడం లేదు. అటు ప్రభుత్వం, ఇటు విపక్షం రెండు పక్షాలు కూడా పంతాలకు పోతూ ప్రజాధనాన్ని, సమయాన్ని వృధా చేస్తున్నాయి. పోడియంలోకి దూసుకుని రావడం, అరవడం, కేకలు పెట్టడం సభనుంచి వెళ్లిపోవడం ఏ రకమైన ప్రజాస్వామ్యమో కాంగ్రెస్ చెప్పాలి. గత మూడు రోజులుగా ఇదే తంతు సాగుతోంది. గతంలో లాగానే ఈ బడ్జెట్ సమావేశాల్లో కూడా ఇది కనిపిస్తోంది. సమస్యలను చర్చించడానికి ఉన్న పద్దతులను వదిలేసి కాంగ్రెస్ సభాస్తంభన అస్త్రాన్ని ఉపయోగించుకుంటోంది. కేవలం సభా కార్యక్రమాలకు అవరోధం లేదా, అంతరాయం కల్పించడం ద్వారా సభా కార్యక్రమాలు సాగకుండా చేస్తోంది. గతంలో అనేక సందర్భాల్లో ఇదే పద్దతిని అవలంబించింది. సాధారణంగా బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ, ఆ తరవాత బడ్జెట్‌పై చర్చలు ప్రధానంగా ఉంటాయి. ఈ సందర్భంగా ఏదేని అంశాన్ని చర్చించే అవకాశం ఉంటుంది. కానీ కాంగ్రెస్ చర్చ కోరుకోవడం లేదు. కేవలం రచ్చనే కోరుకుంటోంది. దీంతో ప్రచారం వస్తుందన్న ధీమాలో ఉంది. ఇకపోతే ప్రధానంగా మాజీ ఆర్మీ చీఫ్ నరవణె పుస్తకం ఆధారంగా చైనా సరిహద్దుల్లో పరిస్థితులు, అమెరికాతో ఒప్పందం పైనా చర్చించాలని రాహుల్ లేదా కాంగ్రెస్ కోరుకుం టోంది. అయితే దీనికి కొన్ని రూల్స్ ఉన్నాయి. ఈ మేరకు చర్చకు ప్రతిపాదించి, చర్చ చేయవచ్చు. ఇకపోతే అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రభుత్వం ప్రకటన చేయకముందే కాంగ్రెస్ యాగీ చేస్తోంది. ఇంతకాలం ట్రేడ్ డీల్ జరగనందుకు మోడీపై దుమ్మెత్తి పోసారు. మన సమస్యలపై పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు ట్రేడ్ డీల్ కుదరగానే అదేదో ద్రోహం జరిగినట్లుగా లేదా మోడీ అమెరికాకు అమ్ముడు పోయినట్లుగా ఆరోపిస్తున్నారు. పార్లమెంటులో ప్రభుత్వం ప్రకటనకు సిద్దంగా ఉన్న సమయంలోనే సమావేశాల్లో రచ్చ చేయడం కాంగ్రెస్÷–కే చెల్లింది. అమెరికా –భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం జరిగిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్సోషల్ మీడియాలో ప్రకటించటం, ఆ తరువాత మన ప్రధాని మోడీ అవునన్నట్టుగా ట్రంప్‌నకు ధన్యవాదాలు చెప్పుకోవటం జరిగింది. భారతదేశ ఆత్మగౌరవాన్ని, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించేదిగా ఉన్నదీ లేనిదీ చర్చిస్తే తెలుస్తుంది. ఏకపక్షంగా అదనపు సుంకాలు విధించటం దగ్గర నుంచి మన ఆర్థిక వ్యవస్థను అవహేళన చేయటం దాకా ట్రంపు సాగించిన బెదిరింపులపై భారత్ ఓపిక పట్టింది. యూరోపియన్ యూరియన్‌తో ఒప్పందం కుదరగానే ఇప్పుడు ట్రంప్ దిగివచ్చారు. అయితే దీనిని సానుకూలంగా చూడాల్సి విపక్షాలు ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శలకు దిగడం ఎంతవరకు సమంజసమో సమాధానం చెప్పాల్సిందే! దేశ అవసరాలను బట్టి, అవకాశాలను బట్టి మనం వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవటం సాధారణ విసయం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఇదే చేస్తుంది. నిజానికి అహంకారపూరితంగా అమెరికా అధ్యక్షుడు బెదరింపు ధోరణితో వ్యవహరించారు. మన దేశం చౌకగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుంటే– వద్దని అడ్డం పడ్డాది. మన దేశ రైతాంగాన్ని దారుణంగా దెబ్బ తీసేవిధంగా తన వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. మనం ఏయే దేశాలతో వాణిజ్య సంబంధాలను కలిగి ఉండాలో, కూడదో అదే నిర్దేశించాలని చూశారు. . ఇలాంటి తలబిరుసు పెత్తనానికి భారత్ ఎట్టి పరిస్థితుల్లోనూ తలవొంచకూడదని నిర్ణయించి, ఇంతకాలం ట్రేడ్ డీల్‌ను పక్కన పెట్టింది. పాకిస్తాన్– ఇండియా యుద్దాన్ని తానే ఆపానని ట్రంప్ అనేకసార్లు ప్రకటించుకున్నా, భారత్‌పై సుంకాలను భారీగా విధించినా, అక్రమ వలసల పేరిట భారతీయులకు సంకెళ్లు వేసి, దేశంలో దించిపోయినా– భారత్ ఓపిక పట్టింది. ఇప్పుడు కూడా ట్రంప్ ప్రకటించేదాకా ఒప్పందంపై మనం ముందుకు రాలేదు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ఎన్నికయ్యాక– తన దారిలోకి రాని దేశాలపై ఎడాపెడా సుంకాలు విధించటం ఒక వ్యూహంగా ఎంచుకున్నాడు. కెనడా, బ్రిటన్, దక్షిణ కొరియా వంటి మిత్రదేశాలపైనా, రష్యా, చైనా వంటి పోటీ దేశాలపైనా విరుచుకుపడ్డాడు. సుంకాల విధింపుతో ఆయా దేశాల వాణిజ్యానికి తాత్కాలికంగా నష్టం కలిగించారు. అయితే ధరలు పెరిగి అమెరికా పౌరులకు కూడా అంతే సమస్య ఎదురవుతుంది. దీంతో, ట్రంప్ దూకుడుకు వ్యతిరేకంగా అమెరికాలోనూ పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమయ్యా యి. సుంకాలు ఎదుర్కొన్న అనేక దేశాలు సైతం అదే పద్ధతిలో సమాధానం చెప్పాయి. నీకు మేమంత దూరమో మాకు నువ్వూ అంతే దూరం అని సమాధానం ఇచ్చాయి. భారత్ కూడా అదే పద్దతిని అవలంబించింది. మోడీ ప్రభుత్వం ఏ మాత్రం లొంగుబాటుకు ఒప్పుకోలేదు. మనపట్ల అమెరికాలోనే సానుకూలత వ్యక్తం అయ్యింది. అమెరికాలో ఒత్తిడి తట్టుకోలేక ట్రంప్ భారత్‌తో ఓ రకంగా కాళ్ళ బేరానికి వచ్చాడని చెప్పుకోవాలి. అంతేగానీ భారత్ పరువు పోయిందని, మోడీ లొంగిపోయాడని విమర్శించే వారికి అంతర్జాతీయ వ్యవహారాలు తెలియవను కోవాలి. ఈ విషయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు ముందున్నారు. ట్రంప్ బెదరింపులకు లొగివుంటే ఎప్పుడో ఒప్పందం ఖరారు అయ్యేది. అయితే ఇవన్నీ చర్చించాల్సిన అంశాలే. కాదని ఎవరూ అనడం లేదు. పార్లమెంటులో చర్చకు ముందే గలాభా సృష్టించడం ద్వారా కాంగ్రెస్ రాజకీయ పైత్యాన్ని చాటుకుంది. మోడీ ప్రకటన చేసే వరకు ఆగాలి. తాము కోరుకున్నట్లు ఇప్పుడే..ఈ క్షణమే చర్చ జరగాలని అనుకోవడం దుర్మార్గం తప్ప మరోటి కాదు. పార్లమెంటులో సమస్యలపై చర్చించకుండా, జారుకోవడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి.

## మరో బీహార్‌లా మారుతున్న ఎపి

**- రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యింది**

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**




**విజయవాడ,ఫిబ్రవరి4( తెలుగురేఖ):** ఎపి మరో బీహార్ లా మారుతోంది.. రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యింది ' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం విజయవాడ ఎంబివికె లో నిర్వహించిన మీడియా సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా హైజాక్ అయ్యిందని అన్నారు. నిన్నటి రోజున తిరుపతి యూనివర్సిటీలో జరిగిన ఘటన అత్యంత దారుణమన్నారు. విద్యార్థి నాయకులపై దౌర్జన్యం చేసి కొట్టి హింసించారని? పోలీసులు చొరవ తీసుకొని ఉండకపోతే వారిని చంపేసి ఉండేవారని ఆరోపించారు. ఇలాంటి అరాచక పరిపాలన రాష్ట్రంలో ఇంతకుముందెన్నడూ లేదు అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మరో బీహార్ లాగా మారిపోతుందన్నారు. రూల్ ఆఫ్ లా అనేది స్థాపించకపోతే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉండవు అని అన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. మోహన్ బాబు యూనివర్సిటీ ఓ సేవా సంస్థ కింద రిజిస్టరయ్యి ఉందని, కానీ కోట్ల రూపాయలను విద్యార్థుల తల్లిదండ్రుల నుండి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులపై దౌర్జన్యం చేయడమేంటి ? అని ప్రశ్నించారు. ' మీ చేతుల్లోనే ఉందా చట్టం.. మీదేనా రాజ్యం ' అని ధ్వజమెత్తారు. బౌన్సర్లను యూనివర్సిటీలోనికి ఎలా అనుమతిస్తారు ? అని నిలదీశారు. మోహన్ బాబు జీవితంలో విలన్ లాగ ప్రవర్తిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోబోరని, తగిన బుద్ధి చెబుతారని వి.శ్రీనివాసరావు హెచ్చరించారు.

## బిజెపి అభ్యర్థులకు బూస్ట్

**- ప్రచారం చేయనున్న పవన్ కళ్యాణ్**

**హైదరాబాద్,ఫిబ్రవరి4( తెలుగురేఖ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ త్వరలో తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. ఈనెల 7,8 తేదీల్లో బీజేపీకి మద్దతుగా పవన్ ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు బిజెపి నేతలకు హామీ ఇచ్చారు. మంగళవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ తెలంగాణ శాఖ అధ్యక్షుడు రామచందర్‌రావు.. పవన్ కళ్యాణ్‌ను కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మున్సిపల్ ఎన్నికలు సహా పలు కీలక అంశాలపై ముగ్గురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా బీజేపీ తరఫున ప్రచారంలో పాల్గొనాలని కిషన్ రెడ్డి, రామచందర్ రావు.. పవన్‌ను కోరారు. ఇందుకు పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. ఈ విషయాన్ని రామచందర్ రావు స్వయంగా వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పవన్ కళ్యాణ్ గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నా. తెలంగాణలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలతో సహా ముఖ్యమైన అంశాలపై విస్తృతంగా, అర్థవంతమైన చర్చలు జరిపాము. పవన్ కళ్యాణ్ గారు భారతీయ జనతా పార్టీకి పూర్తి మద్దతు ప్రకటించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి అంగీకరించారు' అని తెలిపారు. కాగా, రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల పరిధిలో ఫిబ్రవరి 11న ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఆ తర్వాత 13న ఫలితాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ సారి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కలిసి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. బీజేపీ, జనసేన స్నేహపూర్వక పోటీ అంటూ ఈ మేరకు జనసేన పార్టీ ట్వీట్ చేసింది.

# బోత్ ఆర్ నాట్ సేమ్




**- మా వాళ్లు గుణవంతులు.... వాళ్లు ధన వంతులు**

**- మా వాళ్లు మీ కోసం కొట్లాడి జైలుకు పోతే... వాళ్లు కబ్జాలు చేసి జైలుకు వెళ్లారు**

**- మేం కేంద్రం నిధులు తెచ్చినం... వాళ్ల తెచ్చిన నిధులను డైవర్ట్ చేశారు**

**- వాళ్లు గెలిస్తే పన్నుల మోత... మేం గెలిస్తే పన్నులు పెంచకుండా అభివృద్ధి చేస్తాం**

**- ఎవరికి ఓట్లేసి గెలిపిస్తారో మీరే ఆలోచించుకుని తీర్పు ఇవ్వండి**

**- బీజేపీకి మేయర్ పీఠాన్ని అప్పగిస్తే వరదల్లా పెద్ద ఎత్తున నిధులు తీసుకొస్తా...**

**- కరీంనగర్ ఎన్నికల ప్రచారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ హాట్ కామెంట్స్...**



**కరీంనగర్ ఫిబ్రవరి 04 తెలుగురేఖ:** కరీంనగర్ లో మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే వరదల్లా నిధులు తెచ్చే బాధ్యత తీసుకు వస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ ఇచ్చారు. పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను గెలిపిస్తే మీ ఇండ్లలోకి వరద నీళ్లు వస్తాయే తప్ప అభివృద్ధి జరగదని అన్నారు. "బీజేపీ పక్షాన పోటీ చేసే అభ్యర్థులు గుణవంతులైతే... కాంగ్రెస్, బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు ధనవంతులు. మా వాళ్లు (బీజేపీ) మీ సమస్యలపై పోరాటం చేసి జైలుకు పోతే, ఆ పార్టీల నాయకులు కబ్జాలు, దోపిడీలు చేసి జైలు కెళ్లారు. బోత్ ఆర్ నాట్ సేమ్"అని తనదైన శైలిలో చెప్పారు. బుధవారం రోజున సాయంత్రం కరీంనగర్ లోని రాంనగర్ సత్యనారాయణ స్వామివద్ద తొలుత 46, 47 డివిజన్ల అభ్యర్థులు అఖిల్ గౌడ్, గాజె రమా శివరాం పక్షాన, అనంతరం కమాన్ చౌరస్తా వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో 38, 56, 57 డివిజన్ల అభ్యర్థులు దేవసాని సరస్వతి, తాటి ప్రభావతి, కొలిపాక రమ్యశ్రీ పక్షాన ప్రచారం నిర్వహించారు. ఆయా డివిజన్ల బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ప్రజలను అభ్యర్థించారు. మాజీ మేయర్ సునీల్ రావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, సీనియర్ నాయకులు నల్లాల ఓదేలు, ప్రమోద్ రావు, యువ క్రాంతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నిప్పులు చెరిగారు. సంజయ్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు....

ఇక్కడ రమా సత్యనారాయణ స్వామి టెంపుల్ నుండి సంతోష్ నగర్, పారమిత స్కూల్, జ్యోతి నగర్, భాగ్యనగర్ సాయిబాబా టెంపుల్ ఏరియా రోడ్లు.... హైమాస్ట్ లైట్ మొదలు ఇక్కడ జరిగిన అభివృద్ధి పనులన్నీ స్మార్ట్ సిటీ నిధులతో నిర్మించినవే...

టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు, అవతల ఉన్న ఎల్ఎండి బైపాస్ రోడ్డును సైతం కేంద్రం ఇచ్చిన 30 కోట్లతో ఆధునికరించినం.

ఇట జాతీయ రహదారి కనెక్టింగ్ రోడ్డు.. అటు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఇటు సిరిసిల్ల బైపాస్ రోడ్డు వరకు రూపాయల 10 కోట్ల కేంద్ర నిధులతోనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు... కేంద్ర పైసలతోనే సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసినం.

అమృత్ 1 ద్వారా కేంద్రం 132 కోట్లు ఇస్తే ఆ పైసలతోనే మార్క్ ఫెడ్ దగ్గర కొత్త రిజర్వాయరు ను నిర్మించినం. గతంలో డైలీ ఇంటికి నీళ్లు వచ్చేవి. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల దినం తప్పించి దినం నీళ్లు వస్తున్నయ్.

కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే... ప్రతినిత్యం తాగునీటి సరఫరా అందిస్తాం.

46 డివిజన్లో ఆశించిన అభివృద్ధి జరగలే. అఖిల్ గౌడ్ యాక్టివ్. అఖిల్ తోపాటు 47వ డివిజన్ అభ్యర్థిని గాజ రమను, 38వ డివిజన్ దేవసాని సరస్వతి, 56వ డివిజన్ తాటి ప్రభావతి, 57వ డివిజన్ కొలిపాక రమ్యశ్రీలను భారీ మెజారిటీతో గెలిపిస్తే పెండింగ్ పనులన్నీ పూర్తి చేయిస్తా... ఆదర్శంగా తీర్చిదిద్దుతా...

ఇక్కడ సత్యనారాయణ ఆలయంలో అన్నీ రాజకీయాలే నడుస్తున్నయ్. పూజలు చేయనీయరు. ఆధిపత్య పోరుతో నలిగిపోతోంది. ఈ ఆలయానికి రావాలంటే ప్రజలు భయపడుతున్నారు. నేను కూడా రాలేదు.

నేను మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని నిర్మించిన. అమ్మవారే అన్నీ. ఆ ఆలయానికి ఛైర్మన్ ఉండరు. హుండీలు ఉండవు. మేమంతా అమ్మవారి సేవకులే. ఆలయం కడితే చందాలు వసూలు చేయను. బీజేపీకి మేయర్ పీఠాన్ని అప్పగిస్తే సత్యానారాయణ స్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభం కట్టిస్తా. ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా.

ఈ కమాన్ నుంచి.. భారత్ టాకీస్ చౌరస్తా.. టవర్ సర్కిల్ రోడ్డు.. శాస్త్రి రోడ్డుకు వెళ్లే రోడ్డు..రాజీవ్ చౌక్ రోడ్ల బాగైనవంటే కేంద్ర నిధులతోనే...గతంలో గణేష్ నగర్ అంబేద్కర్ స్టేడియం రోడ్డుపై వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే... చినుకు పడితే గోస ఉండేది...మరి ఇయాళ ఎట్లుంది?...ఆ పక్కనున్న డ్రైనేజీని వెడల్పు చేసి పైన స్లాబ్ వేసి.. ఆధునికరించిన పైసలన్నీ కేంద్రానివే.

38వ డివిజన్లో ప్రతిపాదనల దశలోనే ఆగిన కొన్ని పనులు. శ్రీనివాస్ థియేటర్ తోపాటు ఇంటర్నల్ రోడ్లు అవసరం. కొన్నింటికి బిల్లులు రాక ఆగినయ్. కలెక్టరేట్ నుంచి వచ్చే పెద్ద డ్రైనేజీ సమస్య...దీంతోపాటు ఈ 3 డివిజన్లపై దృష్టి పెడతా...

ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల నుంచి ఒక్క పైస ఇయ్యలేదు. మేయర్ పీఠం అప్పగిస్తే కొన్ని నెలల్లోనే వాటిని పూర్తి చేయిస్తాం.

మోదీ ప్రభుత్వం ఇచ్చిన 26 కోట్లతోనే అంబేద్కర్ స్టేడియాన్ని ఆధునీకరించినం. మోడ్రన్ షాపింగ్ కాంప్లెక్స్ కట్టినం...పిల్లల కోసం బాస్కెట్ బాల్ కోర్టు, స్కేటింగ్ మైదానం, వాకింగ్ ట్రాక్ ను నిర్మించాం. ఇండోర్ స్టేడియాన్ని బాగు చేసినం. ఈ కమాను నుంచి హౌసింగ్ బోర్డ్ కాలనీకి అటు రాజీవ్ రహదారి వరకు, గోదావరిఖని బైపాస్ దాకా కేంద్ర నిధులతోనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినం.

బీఆర్ఎస్ అంటేనే భూ రాక్షసుల సమితి. వాళ్లు అధికారంలో ఉన్నంతకాలం కబ్జాలు చేసి దోచుకున్నరు. పదేళ్ల పాలనలో ప్రజలను జలగల్లా పీల్చుకుతిన్నరు. కనబడ్డ జాగాలను కబ్జా చేసిర్రు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎంత దోచుకున్నరో రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకంటే ఎక్కువ దోచుకుంటున్నరు. కరీంనగర్ కార్పొరేషన్ కు మాత్రం నయాపైసా ఇయ్యలే. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలే.

కేంద్రం నుండి నేను మోదీ వద్దకు పోయి నీళ్ల కోసం రూ.136 కోట్లు తెచ్చిన. కరీంనగర్ అభివృద్ధి పనుల కోసం మరో రూ.50 కోట్లు తెచ్చిన.

కాంగ్రెస్ ను గెలిపిస్తే ఇంటి పన్నులు పెంచుతారు. నల్లా బిల్లులు పెంచుతారు. అన్ని రకాల పన్నులు పెంచి ఖజానా నింపుకుంటరు. బీఆర్ఎస్ గెలిచినా ప్రయోజనం లేదు. కేంద్రం నుండి వచ్చిన పైసలను సంపుకుంటరు.

కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి. ఇంటి పన్నులు పెంచకుండా, నల్లా ఛార్జీలు పెంచకుండా కేంద్రం నుండి నిధులు తీసుకొచ్చి కరీంనగర్ ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తా... దయచేసి అభివృద్ధిని మధ్యలో ఆగకుండా ఉండాలంటే బీజేపీని గెలిపించాలని కోరుతున్నా..

ఈ ఎన్నికలు ధనవంతులకు, గుణవంతులకు మధ్య జరుగుతున్న పోరాటం. ధనవంతులను గెలిపిస్తే మీ పనుల కోసం వాళ్ల ఇండ్ల చుట్టూ వ తిరగాలి. మంచి గుణమున్న అభ్యర్థి నీ వెంట ఉంటే అభివృద్ధి జరుగుతుంది. అదే ధనమున్న వ్యక్తిని ఆదరిస్తే మరింత దోపిడీ జరుగుతుంది. గుణవంతులను గెలిపిస్తే వాళ్లు ఎప్పుడు మీ వెంట ఉంటూ సేవ చేస్తారు. గుణవంతులవైపు ఉంటారో.. ధనవంతుల వైపు ఉంటారో.. మీరే ఆలోచించుకోండి.

వాళ్లది కాసుల ఆరాటం వాళ్ళది.. మాది ప్రజా సమస్యలపై పోరాడే ఆరాటం. వాళ్ల కబ్జాలు చేసి జైలుకు పోయినోళ్లు... మా వాళ్లు మీ కోసం కొట్లాడితే జైలుకు వెళ్లినోళ్లు. ఎవరికి ఓటేస్తారో ఆలోచించి తీర్పు ఇవ్వండి.

# ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకం ఖమ్మం

**- ప్రచారంలో ముందున్న మంత్రి పొంగులేటి**

**- విభేదాలు రాకుండా జగ్రత్త పడ్డ అమాత్యులు**



**ఖమ్మం,ఫిబ్రవరి4( తెలుగురేఖ):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ముగ్గురు మంత్రులకు ప్రతిష్టాత్మకంగా మారాయి, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, తుమ్మలలు తమ ప్రాంతాల్లో పట్టుకోసం యత్నిస్తున్నారు. మంత్రి పొంగులేటి ప్రచారం ముందున్నారు. మున్సిపల్ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. నామినేషన్ల ఉప సంహరణ ప్రక్రియ ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థుల లెక్క తేలింది. చివరి రోజు ఆయా పార్టీలు తమ క్యాండేట్లకు బీ ఫామ్స్ అందజేయగా, టికెట్ ఆశించి భంగపడిన పలువురు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మిగిలిన వారు రెబల్స్ గా మారి బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు ఆయా పార్టీల గుర్తులు ఇవ్వగా, ఇండిపెండెంట్లకు ఆఫీసర్లు గుర్తులు కేటాయించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇక రాజకీయాలు వేడెక్కాయి. మంత్రి పొంగులేటి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచార ఉధృతి పెంచారు. ఖమ్మం జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఒక్క చోట మాత్రమే వార్డు కౌన్సిలర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఏదులాపురం 15వ వార్డులో సీపీఎం, బీజేపీ అభ్యర్థులు తమ నామినేషన్లను విత్ డ్రా చేసుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి తమ్మినేని మంగతాయి ఒక్కరే పోటీలో నిలిచారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం అయింది. భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 106 డివిజన్లు, వార్డులకు 540 మంది బరిలో నిలిచారు. జిల్లాలోని మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. మొత్తం 117 వార్డులకు 922 నామినేషన్లు దాఖలయ్యాయి. స్క్రూటినీ తర్వాత 787 నామినేషన్లు చెల్లుబాటు అవుతాయని గుర్తించారు. మధిరలో 22 వార్డులకు 165 దాఖలు కాగా, గడువు ముగిసేసరికి 95 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. 70 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 19 , బీఆర్ఎస్ తరఫున17 , సీపీఎం 3, సీపీఐ 1, జనసేన 5, బీజేపీ 19, స్వతంత్ర అభ్యర్థులు ఆరుగురు పోటీలో ఉన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో 20 వార్డులకు మొత్తం 130 మంది నామినేషన్ దాఖలు చేశారు. 58 మంది ఉపసంహరణ చేసుకోగా, 72 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. వీరిలో బీఆర్ఎస్ నుంచి 20 మంది, కాంగ్రెస్ నుంచి 20, బీజేపీ 16, బీఎస్పీ 3, ఇండిపెండెంట్లు 13 మంది పోటీ చేస్తున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీలో 32 వార్డుల్లో 202 నామినేషన్లు వచ్చాయి. వాటిలో 15వ వార్డు ఎన్నిక ఏకగ్రీవం కాగా, మిగిలిన 31 వార్డుల్లో 108 మంది పోటీలో నిలిచారు. కాంగ్రెస్? తరఫున 30 మంది, బీఆర్ఎస్? 23, సీపీఎం 7, బీజేపీ 24, సీపీఐ 11 వార్డుల్లో పోటీలో అభ్యర్థులను నిలిపాయి. 13 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు. సత్తుపల్లిలో 23 వార్డుల్లో స్క్రూటినీ తర్వాత 124 మంది పోటీలో నిలిచారు. వీరిలో 83 మంది బరిలో ఉండగా, 41 మంది విత్ డ్రా చేసుకున్నారు. కాంగ్రెస్ నుంచి 23, బీఆర్ఎస్ 22, బీజేపీ 22, జనసేన 4, సీపీఐ 2, సీపీఎం నుంచి ఒక్కరు, ఇండిపెండెంట్లు 9 మంది పోటీలో నిలిచారు. వైరా మున్సిపాలిటీలో 20 వార్డుల్లో మొత్తం 155 మంది నామినేషన్లు వేశారు. వీటిలో 75 మంది విత్ డ్రా చేసుకోగా, 80 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ఇక్కడ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గాలు వేర్వేరుగా నామినేషన్లు దాఖలు చేశారు. చివరి రోజు భట్టి వర్గంలో 12 మందికి బీ ఫామ్స్ దక్కగా, మంత్రి పొంగులేటి వర్గంలో ఐదుగురికి, ఎంపీ రేణుకాచౌదరి వర్గంలో ఒకరికి బీఫామ్ ఇచ్చారు. ఒక వార్డులో సీపీఐ అభ్యర్థికి, మరొక వార్డులో సీపీఎం అభ్యర్థికి మద్దతిస్తూ కాంగ్రెస్ తరఫున నామినేషన్లు వేయలేదు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్, ఇల్లెందు, అశ్వారావు పేట మున్సిపాలిటీల్లో విత్ డ్రాల అనంతరం 540 మంది బరిలో నిలిచారు. వీరికి ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్?లో 60 డివిజన్లకు 354 మంది పోటీలో ఉన్నారు. అశ్వారావుపేట మున్సిపాలిటీలో 22 వార్డులకు 78 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

# భారీ కాన్వాయ్‌తో మాజీ సిఎం జగన్ రాక

**- గుంటూరు రోడ్డుపై కిలోమీర్ల మేర ట్రాఫిక్ జామ్**



**గుంటూరు, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):** మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి నుంచి గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి మంది మార్బలంతో గుంటూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో గుంటూరు – విజయవాడ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో కనీసం అంబులెన్స్‌లకు కూడా దారి లేకుండా పోయింది. ట్రాఫిక్ భారీగా స్తంభించడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ట్రాఫిక్ ఇబ్బందులపై అయితే గతంలో పల్నాడు, నెల్లూరు జిల్లాల్లో జగన్ పర్యటనల సందర్భంగా జరిగిన పరిణామాల నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో పోలీసు ఆంక్షలు విధించారు. ఎడ్లపాడు జాతీయ రహదారిపై వైసీపీ నేతల వాహనాలను పోలీసులు నిలిపివేస్తున్నారు. గుంటూరులో జగన్ పర్యటనకు వెళ్లకుండా ఆంక్షలు పెట్టి, పలువురు వైసీపీ నేతలకు నోటీసులు ఇచ్చారు. మరోవైపు పల్నాడు జిల్లా నుంచి గుంటూరుకు వైసీపీ కేడర్ తరలివెళ్తోంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు దగ్గర తనిఖీలు నిర్వహించి ఎక్కడికక్కడ వైసీపీ నేతలను పోలీసులు అడ్డుకుంటున్నారు. మరోవైపు.. జగన్ గుంటూరు పర్యటనకు అనుమతి ఇవ్వాలని వైసీపీ నాయకులు పోలీసు అధికారులను కోరారు. అందుకు పోలీసులు నిరాకరించారు. గుంటూరు జిల్లా పరిధిలో పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడా బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతి లేదని జిల్లా పోలీసు యంత్రాంగం ప్రకటన జారీ చేసింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా, సాధారణ జనజీవనానికి ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పని గుంటూరు పోలీసులు హెచ్చరించారు.

# పులి జాడలతో జనం బెంబేలు


**- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**



**జనగామ, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాందోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు అటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో అధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# మోహన్‌బాబు వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

**- సమగ్ర విచారణకు సిఐటీయు డిమాండ్**



**తిరుపతి, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
సినీనటుడు మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం సిఐటీయు నేతలు రుయా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి యువ నాయకులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మురళి మాట్లాడుతూ గత కొంతకాలంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల యూనివర్సిటీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో. ఓ విద్యార్థి మరణం పలు అనుమానాలను కలిగిస్తోందని అన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి నిజా నిజాలు వెల్లడి చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులకు కడుపు శోకాన్ని మిగల్చకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం

**- ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు**



**రాయపూర్, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు. పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు' అని తెలిపారు. కాగా, బీజేపీ నాయకుడు, జిల్లా పంచాయత్ ప్రెసిడెంట్ రాజేష్ సూర్యవంశీకి ప్రసాద్ మేనల్లుడని తెలుస్తోంది.

# ఉమ్మడి జిల్లాలో పురపోరులో జోరు

**- బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి**
**- ఎక్కడిక్కడ ప్రచారంలో నేతలు బిజీ**



**నిజామాబాద్, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుట్రలు, కుతంత్రాలతో ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి మున్సిపల్ ఎన్నికలే నాంది పలుకుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థులు ఐక్యతతో పనిచేసి ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీలోకి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయనిమాజీ మంత్రి అన్నారు. తెలంగాణను బీడు భూమిగా మార్చిన కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. బీఆర్ఎస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఇదిలావుంటే పురపాలక ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి పక్కా వ్యూహంతో దూసుకుని పోతోంది. ఉమ్మడి జిల్లాలో పురపాలక పీఠాలను కైవసం చేసుకునేందుకు ముఖ్య నేతలంతా రంగంలోకి దిగారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను క్రోడీకరించి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే అద్భుతమైన ఫలితాలు రాబట్టేందుకు పని చేయాలని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కీలకమైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటుగా ఆర్మూర్, బోధన్, భీంగల్ పురపాలక పీఠాలపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు నేతలంతా రంగంలోకి దిగారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తన నియోజకవర్గంలోని భీంగల్ మున్సిపాలిటీని స్వాధీనం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు. గెలుపు గుర్రాలనే ఎంపిక చేసి బరిలోకి దింపారు. ఆర్మూర్‌లో వరుసగా గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు ఆశన్నగారి జీవన్ రెడ్డి చురుగ్గా వార్డుల్లో కలియ తిరుగుతున్నారు. బోధన్‌లో షకీల్ దంపతులు విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తూ దూసుకు పోతున్నారు. నిజామాబాద్ నగరంలో మరోసారి సత్తా చాటేందుకు బిగాల గణెశ్ గుప్తా తనదైన శైలిలో వ్యూహాలను రచిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. కామారెడ్డి పురపాలక సంఘం లో వరుసగా మూడోసారి బీఆర్ఎస్ జెండాను ఎగిరేసేందుకు ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ప్రణాళికలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి వీజీ గౌడ్‌తో సమన్వయం చేసుకుంటూ కార్యరంగంలో దూసుకు పోతున్నారు. అన్ని వార్డుల్లో కాంగ్రెస్, బీజేపీతో బలంగా తలబడే నాయకులకు కౌన్సిలర్ టికెట్లు కేటాయించి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మైనార్టీ ఏరియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏర్పడిన అసంతృప్తిని అనుకూలంగా మార్చుకునేందుకు గంప గోవర్ధన్ పాటు పడుతున్నారు. ఎల్లారెడ్డిలోనూ సగానికి ఎక్కువ సీట్లు గెలిచి బీఆర్ఎస్ జెండాను మరోసారి ఎగిరేసేందుకు జాజాల సురేందర్ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. బాన్సువాడలో పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి పురపాలక ఎన్నికల ద్వారా గట్టి సమాధానం ఇచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నాయకత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు బలంగా పని చేస్తున్నాయి. బిచ్కుంద మున్సిపాలిటీలో తొలిసారి ఎన్నికలు జరుగుతుండటంతో బీఆర్ఎస్ నేతలంతా కౌన్సిలర్‌గా పోటీ చేసి విజయం సాధించేందుకు భారీగా ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఎన్నికలను మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీల గుర్తులపై ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ పోరులో కారు గుర్తుతో ప్రజల్లోకి బలంగా వెళ్లి వారి మద్ధతును కూడగట్టేందుకు బీఆర్ఎస్ నేతలంతా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

# క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

**- ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి**
**- అవగాహన కోసం షారట్ ఫలిమ్స్ తీస్తా**
**- క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి**





**హైదరాబాద్, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు.శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూడదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అందరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరోగ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు. అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

# జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఇంజనీర్ మృతి

**విశాఖపట్టణం,ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం విశాఖ జిల్లా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఓ ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజినీర్ గా పని చేస్తున్న హర్షవర్ధన్ (36) విజయవాడ వైపు వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా హర్షవర్ధన్ బుధవారం ఉదయం సూసైడ్ నోట్ రాసి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆయన అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్లో హర్షవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# 15లక్షలు తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జోన్ ఎస్ఇ

**హైదరాబాద్, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
ఏసీబీ అధికారుల వలలో భారీ అవినీతి తిమింగలం పడింది. రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

**- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము**
**- కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్థవంతంగా నిర్వహించారు.

# పాత కక్ష్యల నేపధ్యంలో బాబాయ్ హత్య

**వికారాబాద్ ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలో పట్టపగలే నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైయ్యాడు.హత్య చేసిన నిందితుడు దారూర్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. హత్యకు గురైన వ్యక్తి దారూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శంకర్ గా గుర్తించారు స్థానికులు. గతంలో భూ వివాదంలో ఉన్న పాత కక్ష్యల కారణంతో సోంత అన్న కొడుకే బాబాయ్ ని హత్య చేసాడని చెప్తున్నారు గ్రామస్తులు. దారూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు



# కరీంనగర్ బీఆర్ఎస్ లో నిరసనలు



**కరీంనగర్ ఫిబ్రవరి 4 ( తెలుగురేఖ):**
కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. నామినేషన్లు వేసిన అభ్యర్థులకు పార్టీ నుంచి బీ?ఫామ్లు అందకపోవడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్పై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీ?ఫామ్లు డబ్బులకు అమ్ముడుపోయాయంటూ పార్టీ కార్యకర్తలు గంగుల నివాసం ముందు బైఠాయించి నిరసనకు దిగారు. మంత్రి గంగుల ఇంటి ముందు టిఆర్ఎస్ పార్టీ కండువాలు మరియు టిఆర్ఎస్ పార్టీ నుంచి ముద్రించుకున్న ప్రచార పత్రాలను తగలబెట్టారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ రెండో డివిజన్కు చెందిన కొలగాని సాగర్కు బీఆర్ఎస్ టికెట్ విషయంలో మోసం జరిగిందంటూ అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. బీ?ఫామ్ ఇస్తామని హామీ ఇచ్చి చివరి నిమిషంలో మాట మార్చారని, కేవలం పది రోజుల క్రితమే పార్టీలో చేరిన వ్యక్తికి ఎలా బీ?ఫామ్ ఇస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.టికెట్ ఇస్తామని నమ్మించి మోసం చేశారంటూ ఎమ్మెల్యే గంగుల ఇంటి ముందు నిరసనలు కొనసాగుతుండగా, ఈ వ్యవహారం కరీంనగర్ రాజకీయాల్లో కొత్త ఉద్రిక్తతకు దారితీస్తోంది.

Printed and Published by RAMANI WEB OFFSET PRINTERS, Published at 8-81/11/1, AUTONAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001, RNI No. TEL-TEL/2010/31853, Editor: Eldi Ravinder, 9-10/7, KRISHN NAGAR,village:BOMMAKAL, mandal& District:KARIMNAGAR-505001telugurekha1984@gmail.com, 9963197573.